www.prajasakti.com
# ప్రజాశక్తి
గురువారం 10 ఏప్రిల్ 2025
5
వైఎస్ఆర్



## పేదలకు వరం సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కడప అర్బన్ : సిఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే మాధవి అన్నారు. లబ్ధిదారులకు రూ.15,89,745 విలువైన సిఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజా సమస్యలు త్వరగతిన పరిష్కరిస్తూ, ప్రజలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో సిఎం ఆర్ఎఫ్ను పక్కనపెట్టి ప్రజలను ఏ రకంగా పీడించిందో చూశామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా బాధిత కుటుంబాలకు, నిరుపేద కుటుంబాలకు డబ్బులను అందజేసి వారికి ఆపదలో అండగా నిలుస్తున్నామన్నారు.

# పెంచిన గ్యాస్ ధర తగ్గించాల్సిందే

**- వినూత్న రీతిలో గ్యాస్ బండతో శవయాత్ర**


పట్టణంలో గ్యాస్ బండతో శవయాత్ర చేస్తున్న నాయకులు

**ప్రజాశక్తి -బద్వేలు**

పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం బద్వేలు సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల సెంటర్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు గ్యాస్ బండతో శవయాత్ర చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్పై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని రద్దు చేసి అంతర్జాతీయ ముడిచమురు ధరలకనుగుణంగా ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తున్నదన్నారు. పెట్రోల్పై రూ.2లు అదనపు సుంకాన్ని విధించిన ధర పెంచలేదంటూ ప్రజలను మభ్యపరిచి, మోసపుచ్చుటాన్ని నిరసిస్తున్నదన్నారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గాయని, అందుకనుగుణంగా ఇక్కడ కూడా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించి ప్రజలపై భారాన్ని తగ్గించాల్సింది పోయి ఎక్సైజ్ సుంకాన్ని పెంచి కేంద్ర ప్రభుత్వం తన ఖజానాలో వేసుకోవడం గర్హనీయమన్నారు. పైగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచలేదని ప్రచారం చేసుకోవడం ప్రజలను మభ్యపుచ్చడమేనన్నారు. అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పుడు పెంచి, తగ్గినప్పుడు ధర తగ్గించకపోవడం ప్రజలను వంచించడమేనని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని రద్దు చేసి పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే లీటరు రూ.2లు చొప్పున తగ్గించాలని, ఇప్పటికే పెరిగిన విద్యుత్ ఛార్జీలను చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న రాష్ట్ర ప్రజానీకానికిపై పుండు మీద కారం చల్లిన చందంగా వంట గ్యాస్పై ఒకేసారి రూ.50 పెంచడంతో ప్రజలపై మరింత భారాలు పడనున్నాయని వెంటనే పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని లేకపోతే రానున్న కాలంలో ప్రజా మద్దతుతో సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిరసన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ముడియం చిన్ని, నాయకులు షేక్ మస్తాన్ షరీఫ్, గంప అనంతయ్య, పసుపుల మొక్షమ్మ, శాఖా కార్యదర్శులు షేక్ మస్తాన్ బీ, షేక్ ఆదిల్, ముడియం నరసింహ నాయకులు నాగార్జున, బాల గురువయ్య, ఓబుల్ రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు. **బ్రహ్మంగారిమఠం:** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో ఐదు రోడ్ల కూడలిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ మాట్లాడుతూ గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లకు ఉజ్వల పథకం లబ్ధిదారులకు రూ.50 పెంపు దారుణమన్నారు. సామాన్య మధ్యతరగతి ప్రజలు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశానంటే రీతిలో ఉన్న పరిస్థితులలో ఇప్పుడు గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం మరింత భారమయ్యే పరిస్థితి కనబడుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు భాస్కర్, వీరనారాయణ, రమణ, ఆనందరావు, ఆంజనేయులు, చినబ్బి, రామకాష్టారెడ్డి, చక్రవర్తి, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# సీతారాముల కల్యాణోత్సవం ఏర్పాట్ల పరిశీలన


కల్యాణోత్సవం ఏర్పాట్లను పరిశీలిస్తున్న టిటిడి జెఇఒ వెంకయ్య చౌదరి

**ప్రజాశక్తి-ఒంటిమిట్ట**

శ్రీకోదండరామ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా 11వ తేదీన జరుగనున్న శ్రీసీతారాముల కల్యాణ ఏర్పాట్లను టిటిడి జెఇఒ వి.వీరబ్రహ్మంతో కలిసి టిటిడి అదనపు ఇఒ సి హెచ్ వెంకయ్య చౌదరి బుధవారం పరిశీలించారు. శుక్రవారం శ్రీకోదండరామ స్వామి కల్యాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచ్చేయనున్న సందర్భంగా ఒంటిమిట్టలో ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. ముందుగా ఒంటిమిట్టలోని టిటిడి అతిథి గృహం వద్ద ముఖ్యమంత్రి బస చేసే గదులలో ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ కోతలు లేకుండా అప్రమత్తంగా ఉండాలని, పరిసర ప్రాంతాలలో పచ్చదనం, పుష్పాలంకరణలు తాజా పుష్పాలతో ఏర్పాట్లు చేయాలన్నారు. టిటిడి అతిథి గృహం నుండి ఆలయం వరకు పరిసర ప్రాంతాలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. ఆలయంలోపల ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో నిల్వ వున్న సామగ్రి, వస్తువులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆలయం అంతా కలియ తిరిగారు. ఆలయం నుండి కల్యాణ వేదిక వరకు విద్యుత్ కాంతులు, పుష్పాలంకరణలతో రాజీ లేకుండా నాణ్యంగా పనులు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో జిల్లా యంత్రాంగం, టిటిడి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. భక్తులు అందరికి అన్నప్రసాదాలు, స్వామివారి కల్యాణ తలంబ్రాలు, శ్రీవారి లడ్డు ప్రసాదం, తాగునీరు, మజ్జిక పంపిణీ చేస్తామని చెప్పారు. భక్తుల రద్దీకి తగ్గట్లు జిల్లా రెవిన్యూ, పోలీసు, స్థానిక పంచాయతీ, టిటిడి అధికారులు సమిష్టిగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. భక్తులు ప్రవేశించే, నిష్క్రమణ ప్రాంతాలలో మరింత అప్రమత్తంగా అధికారులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిటిడి సిఇ సత్యనారాయణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

**కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయండి : కలెక్టర్**

**కడప:** ప్రతి ఒక్కరూ కార్యదీక్షతో విధులు నిర్వర్తించి, శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని సభ భవన్లో జెసి అదితిసింగ్ సింగ్తో కలిసి శ్రీ కోదండరామస్వామివారి కల్యాణోత్సవ విధుల నిర్వహణపై సంబంధిత లైజన్ అధికారులకు ఒక్కరోజు శిక్షణలో భాగంగా వారికి కేటాయించిన అంశాల్లో పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందరక్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11న శ్రీ సీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరుగనుందన్నారు. కల్యాణోత్సవంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా జిల్లా అధికారులు, టిటిడి అధికారులు సంయుక్తంగా, సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, కడప, జమ్మలమడుగు ఆర్డిఒలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, జడ్పి సిఇఒ ఓబులమ్మ, కెఎంసి కమీషనర్ మనోజ్ రెడ్డి పాల్గొన్నారు.

**2 వేల మందితో పటిష్ట భద్రత : ఎస్పి**

**కడప అర్బన్:** ఒంటిమిట్ట శ్రీ కోదండరాముని బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 11న శుక్రవారం నిర్వహించనున్న సీతారాముల కల్యాణం సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పి ఇ.జి.అశోక్ కుమార్ పేర్కొన్నారు. రెండు వేలకు మందిపైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బందో బస్తు విధుల్లో నలుగురు అదనపు ఎస్పిలు, 25 మంది డిఎస్పిలు, 73 మంది సిఐలు, 177 మంది ఎస్ఐలు, 1700 మంది పోలీసు సిబ్బంది ఉన్నారని పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో ఎస్పి బందో బస్తు విధుల నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి, ఎఆర్ సిబ్బందికి బందోబస్తు ప్రణాళికపై దిశానిర్దేశం చేశారు. శ్రీ సీతారాముల కల్యాణానికి పెద్ద ఎత్తున భక్తులు రానున్న నేపథ్యంలో పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు తలెత్తకుండా ట్రాఫిక్ నియంత్రించాలన్నారు. శ్రీ కోదండ రామాలయం, కల్యాణ వేదిక, పార్కింగ్, టిటిడి గెస్ట్ హౌస్ ప్రాంతాల్లో విధుల్లో ఉన్న సిబ్బంది చేపట్టాల్సిన భద్రతా చర్యలపై పలు సూచనలు చేశారు. గ్యాలరీ, వివిఐపి ప్రవేశ మార్గం, విఐపి ప్రవేశ మార్గం వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమ త్తతతో ఉండాలన్నారు. బాంబు డిస్పోజల్ టీమ్, స్పెషల్ పార్టీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్పి కె.ప్రకాష్ బాబు, ఎఎస్పి(ఎఆర్) బి.రమణయ్య, ఎఆర్ డిఎస్పి కె.శ్రీనివాసరావు, ఎస్బి సిఐ భాస్కర్రెడ్డి, ఆర్ఐలు ఆనంద్, వీరేష్, శివరాముడు పాల్గొన్నారు.

**సిఎం జిల్లా పర్యటన ఖరారు :** ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలలో భాగంగా 11న నిర్వహించనున్న కల్యాణోత్సవానికి ప్రభుత్వం తరపున పట్టువ స్త్రాలు సమర్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాకు రానున్నారు. జిల్లా పర్యటన అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. శుక్రవారం సాయంత్రం సిఎం చంద్రబాబు 3.35 గంటలకు విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 4.20కి కడప ఎయిర్పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి 4.30కు రోడ్డు మార్గాన బయల్దేరి ఒంటిమిట్ట టిటిడి గెస్ట్ హౌస్ చేరుకుంటారు. 6.05కు గెస్ట్హౌస్ నుంచి బయల్దేరి 6.10కి కోదండరామ స్వామి దేవాలయం సందర్శిస్తారు. 6.10 నుంచి 6.15 మధ్య పట్టువస్త్రాలు స్వామి వారికి సమర్పిస్తారు. 6.35కు కల్యాణ వేదిక వద్దకు చేరుకుంటారు. 6.45 నుంచి కల్యాణంలో పాల్గొంటారు. 8.40కు టిటిడి గెస్ట్ హౌస్ చేరుకుని అక్కడే రాత్రికి బస చేస్తారు. 12న ఉదయం 8.50కి టీటీడీ గెస్ట్ హౌస్ నుంచి బయలుదేరి 9.20కి కడప ఎయిర్పోర్టుకు చేరుకుని 9.30కు విజయవాడ బయలుదేరి వెళతారు.

**11న కల్యోణోత్సవానికి ప్రత్యేక బస్సులు :** 11న నిర్వహించే ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి కల్యాణోత్సవానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టిసి ఆర్ఎం గోపాల్రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ డిపోల నుంచి 135 బస్సులను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పార్కింగ్ స్థలం నుంచి కల్యాణోత్సవ వేదిక వద్దకు పది ఉచిత బస్సులను టిటిడి సౌజన్యంతో ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

# అభివృద్ధిపై దృష్టి పెట్టండి : ఎంపీ


మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్రెడ్డి

**ప్రజాశక్తి - కడప :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాక్షసానందం పొందుతోందని, అభివృద్ధిపై కాకుండా వైసిపి నాయకులు, కార్యకర్తలపై కేసులే లక్ష్యంగా పెట్టుకున్నారని కడప ఎంపీ వైఎస్.అవినాష్రెడ్డి అన్నారు. బుధవారం మాజీ డిప్యూటీ సిఎం అంజాద్బాషాను ఆయన పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కడప ఎమ్మెల్యే మాధవి, టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి దగ్గర మెప్పు పొందడానికి అధికారులు ప్రయత్నాలు చేసున్నారు. వైసిపి క్యాడర్ వినాశమే టార్గెట్గా పనిచేస్తున్నారని విమర్శించారు. ఎవర్ని వదిలేది లేదని, అన్నీ గుర్తు పెట్టుకుంటామని ఆగ్రహం వ్యక్తం చేశారు. అహ్మద్బాషా అరెస్టు తర్వాత అంజాద్బాషా ఇంటి సమీపంలో టిడిపి నాయకులు సంబరాలు చేయడం దారుణమన్నారు. టిడిపి నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్య క్షులు పి.రవీంద్రనాథ్రెడ్డి, మేయర్ సురేష్బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## బినామీ పట్టాదారులకు అండగా పోలీసులు : వ్య.కా.స

**ప్రజాశక్తి-కాశినాయన**

మండలంలో బినామీ పట్టాదారులకు నరసాపురం ఎస్ఐ హనుమంతు అండగా ఉంటూ పేదలను భయబ్రాంతులకు గురి చేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు పోలయ్యలు పేర్కొన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరులతో వారు మాట్లాడుతూ మండల పరిధిలోని అక్కెంగుండ్ల రెవెన్యూ పొలంలో ఇతర జిల్లాలకు చెందిన భూ కబ్జాదారులు బినామీ పట్టాలు సృష్టించుకుని పేదలు సాగు చేస్తున్నా భూమి మాదంటూ దౌర్జన్యానికి దిగుతుంటే దానికి పేదలు అడ్డుకుంటే ఈ విషయంపై ఎస్ఐ బినామీ పట్టాదారులకు మద్దతు పలుకుతూ పేదలను ఇబ్బంది పెట్టడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. బినామీ ఆర్మీ పట్టాల సంపాదించుకొని ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగులకు కలెక్టర్ దగ్గర నుంచి వచ్చిన ఉత్తర్వులు చూపించమని అడిగినా రెవెన్యూ కార్యాలయంలో వారికి పట్టాలు ఇచ్చిన ఫైలు చూపించమని అడిగినా ఏవీ లేవని బినామీ పట్టాలు సంపాదించుకున్నారని చెప్పినా వినిపించుకోకుండా భూ కబ్జాదారులకే అండగా ఉండటం దారుణమని తెలిపారు. పేదలు గట్టిగా అడిగితే మీపైన కేసులు బనాయిస్తామని బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బినామీ ఆర్మీ పట్టాలు కలిగిన 6, 7, 9, 10, 13, 19, 20, 21, 26, 29, 39, 40, 41, 79, 81, 129, 165, 173, 190 సర్వే నెంబర్లలో సుమారు వంద ఎకరాలు బినామీ పట్టాలు కలిగి ఉన్నారన్నారు. ఆ భూమిలో 15 సంవత్సరాల నుండి పేదల సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ సర్వే నంబర్లు అన్ని 2018 సంవత్సరంలో అప్పటి తమశీల్దార్ మల్లికార్జున ఆధ్వర్యంలో ఆరుగురు తహశీలార్లు సర్వే రిపోర్టును ఆధారంగా ఈ భూములలో పేదలు సాగులో ఉన్నారని కలెక్టర్, ఆర్డిఒలకు నివేదిక ఇచ్చారని పేర్కొన్నారు. ఆధారాలు చూపిన ఎస్ఐ ఏమాత్రం పేదలపై కనికరం చూపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూకబ్జాదారులకు అండగా ఉండటం మానుకోవాలని, పేదలకు న్యాయం చేయకపోతే మళ్లీ ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

## కడప ప్రజల రుణం తీర్చుకుంటాం

**ప్రజాశక్తి-కడప అర్బన్**

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలు అన్ని నెరవేర్చేందుకు తమ వంతు కృషి చేస్తామని కడప ప్రజల రుణం తీర్చుకుంటామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని లా కాలేజ్, షామీరియా మజీద్ ఉన్న నూతనంగా ఏర్పాటు చేయనున్న బ్రిడ్జి ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు రవీంద్ర నగర్ ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాన్ని నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మాట్లాడి దాదాపు రూ.20 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి జిఒ తీసుకురానున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఈ బ్రిడ్జిలు టెంకాయలకు కొట్టడం వరకే పరిమితం అయ్యాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు తీసుకు వస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో నాయకులు ప్రజల అభివృద్ధిని పక్కనపెట్టి దోచుకోవడం, దాచుకోవడం లాంటి కార్యక్రమాలు చేశారని, అందుకే ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని తెలిపారు. త్వరలో ఈ బ్రిడ్జిలకు టెండర్లు పిలిచి 6 నుంచి 8 నెలల కాల పరిమితిలో పనులు పూర్తిచేసి ప్రజలకు ఇస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పరిపాలన చేసిన నాయకులు బుగ్గ వంకను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. బుగ్గ వంకలో కంపచెట్లు ఏపుగా పెరిగి దోమల అధికంగా ఉత్పత్తి అయి ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. ఈనెల 12వ తేదీన అల్మాస్పేట బ్రిడ్జి నుంచి బుగ్గ వంకను క్లీన్ చేసే కార్యక్రమం చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు జియోద్దీన్, సుబ్బరాయుడు, ఖాజా పీర్, లయన్ మన్సూర్ అలీ ఖాన్, డాక్టర్ జిలాని, జిలాని బాష, ఓబుల్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి

## ఎపిజిబి తరలింపు అన్యాయం : సిఐటియు

**ప్రజాశక్తి-కడప అర్బన్ :** ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని తరలించడం అన్యాయమని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులరెడ్డి, మనోహర్, కోశాధికారి లక్ష్మీదేవి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది మే ఒకటి నుంచి రాష్ట్ర స్థాయి గ్రామీణ బ్యాంకును ఏర్పాటు చేస్తూ, దాని ప్రధాన కార్యాలయాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఈ నెల 7న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం అన్యాయమన్నారు. కర్ణాటకలో రెండు గ్రామీణ బ్యాంకులు విలీనమయ్యాయన్నారు. కర్ణాటక గ్రామీణ బ్యాంకు కేంద్రమైన బళ్లారిలో రాష్ట్ర స్థాయి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఇదే సూత్రాన్ని ఆంధ్రప్రదేశ్లో ఎందుకు పాటించలేదని పేర్కొన్నారు. విస్తృత వనరులు, వ్యాపారం, సేవలు, టెక్నాలజీ, విజయాలు ఇలా అన్ని అంశాల్లో ఎపిజిబి జాతీయ స్థాయి రికార్డులు సాధించిందని తెలిపారు. ఎపిజిబి ఉన్న కడపలో ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేయకుండా అమరావతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించడం దారుణమని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం రాష్ట్ర రాజధానిలోనో, రాష్ట్రం నడిబొడ్డునో ఉండాలన్న నిబంధన కూడా ఏదీ లేదని తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, పంజాబ్లో తాజాగా కర్ణాటకలో రాష్ట్ర స్థాయి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాలు ఆ రాష్ట్రాల రాజధానుల్లో కానీ, నడిబొడ్డున కానీ లేవని పేర్కొన్నారు. 18 ఏళ్ల ఎపిజిబి విజయాలు అడవిగాచిన వెన్నెలగా మారిపోతున్నాయని తెలిపారు. రాష్ట్ర స్థాయి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని తరలించడం సరైనది కాదని పేర్కొన్నారు. విభజన చట్టంలోనివి ఇవ్వడం లేదు, కొత్తవి రాక పోగా వున్నవి తరలించడం జిల్లాపై వివక్ష చూపుతున్నారని తెలిపారు.

## నేడు బండలాగుడు పోటీలు

**ప్రజాశక్తి-వల్లూరు:** మండల కేంద్రంలో తూర్పు భాగంలో వెలిసిన శ్రీ అంకాలమ్మ దేవి తిరణాలను పురస్కరించుకొని 10వ తేదీ ఉదయం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంకాలమ్మ దేవి తిరుణాల బుధవారం రాత్రి నుండి ప్రారంభమైనది. ఉదయం 8 గంటలకు కుంకుమ బండ్లు, బోనాలు సమర్పించనున్నారు. అనంతరం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు కొర్ల బండి తిరుగుతుందన్నారు.

## హనుమంత వాహనంపై సీతారామలక్ష్మణులు

**ప్రజాశక్తి-ఒంటిమిట్ట**



ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం రాత్రి విశేషమైన హనుమంత వాహన సేవ వైభవంగా జరిగింది. శ్రీ సీతారామలక్ష్మణులు ప్రియభక్తుడైన హనుమంత వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 గంటల నుండి కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ వాహనసేవ కోలాహలంగా జరి గింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి దర్శించుకున్నారు. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలా హలంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఇఒ నటేష్ బాబు, సూపరింటెండెంట్ హను మంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్ పాల్గొన్నారు.

**కల్యాణానికి 70 వేల తిరుమల లడ్డూలు :** ఒంటిమిట్టలో శ్రీకోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11న సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు అత్యంత వైభవంగా శ్రీసీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నారు. రాములోరి కల్యాణానికి భారీ సంఖ్యలో భక్తులు హాజరు కానున్న నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం(టిటిడి) కీలక నిర్ణయం తీసుకుంది. భక్తుల కోసం తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేసింది. తిరుమలలోని శ్రీవారి సేవాసదన్-2లో బుధవారం శ్రీవారి సేవకుల సాయంతో తిరుమల లడ్డూలను ప్యాకింగ్ చేయించింది.

## అహ్మద్బాషాకు బెయిల్ మంజూరు

**ప్రజాశక్తి - కడప**

మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్బాషా సోదరుడు అహ్మద్ బాషాకు కడపలోని రెండవ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ కోర్టులో బుధవారం బెయిల్ మంజూరైంది. కడప నగరంలోని తాలూకా పోలీస్స్టేషన్లో నమోదైన కేసుపై అహ్మద్బాషాను ఈ నెల 7వ తేదీన సోమవారం కడప జిల్లా కోర్టులోని రెండవ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ కోర్టులో పోలీసులు హాజరు పరిచారు. విచారణ అనంతరం రెండవ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ అహ్మద్బాషాకు 14 రోజులపాటు రిమాండ్ విధిస్తూ తీర్పు ఇచ్చారు. అహ్మద్బాషాకు బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరపు న్యాయవాదులు కోర్టును ఆశ్రయించారు. బెయిల్ పిటిషన్పై బుధవారం రెండవ అదనపు జిల్లా మెజిస్ట్రేట్ కోర్టులో విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు పూర్తయిన అనంతరం రెండవ అదనపు జిల్లా మెజిస్ట్రేట్ అహ్మద్బాషాకు రూ.పది వేలు, ఇద్దరు పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేశారు.

## దళిత క్రైస్తవులను ఎస్సిలుగా గుర్తించాలి

**ప్రజాశక్తి - కడప**

దళిత క్రైస్తవులను ఎస్సిలుగా గుర్తించాలని నేషనల్ దళిత జెఎసి చైర్మన్ కె.ప్రసాదరావు కోరారు. బుధవారం ఆర్అండ్బి అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులకు మత స్వేచ్ఛ హక్కుల రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పాస్టర్ పగడాల ప్రవీణ్ హత్య వదంతాన్ని వెలికి తీయాలని సిబిసిఐడి ఎంక్వయిరీ వేయాలన్నారు. భారత రాజ్యాంగంలో స్వేచ్ఛ సమానత్వం సౌభారతత్వాలు ఉన్నాయని దళిత క్రైస్తవులకు మత స్వేఛ హక్కుల రక్షణ కల్పించాలని, క్రైస్తవులపై దాడులు చేయొద్దని అలాగా చేస్తే క్రైస్తవులకు భారతదేశంలో ప్రత్యేకంగా ఒక రాష్ట్రాన్ని క్రైస్తవులకు కేటాయించాలన్నారు. పగడాల ప్రవీణ్ పోస్టుమార్టం రిపోర్టు బయట పెట్టాలని పీస్ ర్యాలీ న్యూఢిల్లీ జంతర్ మంతర్ వద్ద 14న పెద్ద ఎత్తున శాంతి ర్యాలీ జరుగుతుందని, రాజకీయ పార్టీ నాయకులు, ఎన్జీవోలు, మాల మహానాడు, మాదిగ దండోరా, ఎమ్మార్పీఎస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అందరూ కూడా పెద్ద ఎత్తున హాజరు అవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపిపిఎఫ్ కడప జిల్లా అధ్యక్షులు మల్లెం విజయభాస్కర్ బిషప్ డానియల్ కృష్ణ దాస్ పాస్టర్ డేవిడ్ రాజ్ పాస్టర్ రాజన్న పాస్టర్ కిరణ్ పాస్టర్ అమర్ పాల్గొన్నారు.

## జగన్కు పదవి పోయినా తగ్గని అహంకారం : టిడిపి

**ప్రజాశక్తి కడప అర్బన్**

జగన్కు పదవి పోయినా అహంకారం తగ్గలేదని, మతిస్థిమితం లేక మాట్లాడుతున్నాడని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి హరిప్రసాద్ విమర్శించారు. బుధవారం హరిటవర్స్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన ప్రభుత్వంలో పోలీసులను ఇష్టమొచ్చినట్లు వాడుకుని ఇప్పుడు వారిని గుడ్డలూడదీసి నిలబెడతాం అనడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. జగన్ హత్యా రాజకీయాల గురుంచి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. గత ప్రభుత్వంలో జిల్లాలో ఎన్ని హత్యలు జరిగాయో సమాధానం చెప్పాలన్నారు. ప్రొద్దుటూరు నందం వెంకట సుబ్బయ్య, వైసిపి ప్రభుత్వం పొట్టన పెట్టుకుందన్నారు. సొంత చిన్నాన్న ను హత్య చేయించిన ఘనత జగన్ ది అన్నారు. నిజంగా పరిటాల కుటుంబం, కూటమి ప్రభుత్వం అనుకుంటే జగన్ రోడ్ల మీద తిరగలేడన్నారు. హత్యా రాజకీయాలకు ఏపీ ప్రజలు భయపడి కూటమి ప్రభుత్వాన్ని భారీ మెజారిటీ తో గెలిపించారన్నారు. ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా తీర్పు ఇచ్చిన జగన్కు ఇంకా సిగ్గు రాలేదని చెప్పారు. సమావేశంలో బలిజ సంఘం నాయకులు నాగరాజు, గంధం ప్రసాద్, టిడిపి నాయకులు అమీర్, ఖాసిం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హరిప్రసాద్

# ప్రయివేట్ డిగ్రీ కళాశాలల సమస్యల పరిష్కారానికి కృషి

**- రాష్ట్ర అధ్యక్షులు గుండారెడ్డి**

**ప్రజాశక్తి-కడప అర్బన్**

రాష్ట్రంలో ప్రయివేట్ డిగ్రీ కళాశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్మెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.గుండారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడపలో అసోసియేషన్ ఆత్మీయ సమావేశం యోగి వేమన యూనివర్సిటీ ప్రయివేటు డిగ్రీ కాలేజీ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశానికి 6 యూనివర్సిటీల నుంచి ప్రయివేటు డిగ్రీ కళాశాల యాజమాన్యాలు హాజరయ్యారని తెలిపారు. 5 సంవత్సరాలు అఫ్లియేషన్ ఇవ్వాలని కోరారు. జిఒ నంబరు 22 రద్దుచేసి డిగ్రీ ఫీజు నిర్ణయ విధానం పాత పద్ధతిలో కొనసాగించాలని పేర్కొన్నారు. జిఒ నంబర్ 36 రద్దు చేయాలని కోరారు. పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ సౌకర్యం పునరుద్ధరించాలని చెప్పారు. ఆన్లైన్ అడ్మిషన్లు రద్దుచేసి ప్రత్యామ్నాయంగా కొత్త విధానం ప్రవేశపెట్టాలని తెలిపారు. డిగ్రీలో 70:30 మేనేజ్మెంట్ కోట రద్దుచేసి, పూర్తిస్థాయిలో రీయింబర్స్మెంట్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అఫ్లియేషన్ ఫీజు అన్ని యూనివర్సిటీల పరిధిలో ఒకేలా ఉండేటట్లు ప్రభుత్వం చూడాలని కోరారు. డిగ్రీలో తెలుగు మీడియంలో ప్రవేశపెట్టాలని పేర్కొన్నారు. అఫ్లియేషన్ ఫీజులో జిఎస్టి తీసివేయాలని చెప్పారు. పరీక్షా విధానంలో నూతన వరవడితో పటిష్టమైన వ్యవస్థను తీసుకురావాలని కోరారు. విద్యా సంస్థల బస్సులకు రోడ్డు టాక్స్ ఇతర రాష్ట్రాల వలే ఇక్కడ అలాగే ఉండేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక అధ్యక్షులు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జయరాం, నాయకులు శౌరీలురెడ్డి, జి.వెంకటరెడ్డి, సురేంద్రరెడ్డి, మహానందయ్య, సుబ్బారెడ్డి, వివిధ కళాశాల యాజమాన్యాలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గుండారెడ్డి

**అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఎన్నిక :** ఎపి ప్రయివేట్ డిగ్రీ కళాశాల మేనేజ్మెంట్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా మహానందయ్య, శౌరీలురెడ్డి వ్యవహరించారు. రాష్ట్ర అధ్యక్షులుగా పి.జయరాం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ పి.పెద్దిరాజు, ఉపాధ్యక్షులుగా ముగ్గురు, సంయుక్త కార్యదర్శిగా ముగ్గురు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ 9 మంది, సలహాదారులుగా ముగ్గురు, రీజినల్ కో-ఆర్డినేటర్లుగా నలుగురు, టెక్నికల్ కో-ఆర్డినేటర్ ఒకరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు జయరాం మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాల నిర్వహిస్తామని తెలిపారు. అసోసియేషన్ కుటుంబ సభ్యులుగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మిగిలి ఉన్న 12 జిల్లాలను కలుపుకొని పోతామని చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.పెద్దిరాజు మాట్లాడుతూ ప్రభుత్వంతో మంచి సంబంధాలు నెలకొల్పుకుంటూ సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో సమస్యలు ఉంటే పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. ఎటువంటి విభేదాలు లేకుండా ముందుకు వెళదామని పిలుపునిచ్చారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైఎస్ మనోహర్ రెడ్డి, వరప్రసాద్

## ఉచిత మజ్జిగ కేంద్రం ఏర్పాటు అభినందనీయం

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

పట్టణంలోని వినాయక స్వామి గుడి సమీపంలో ప్రతి సంవత్సరం వేసవికాలంలో ఉచిత మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసిన రామకృష్ణారెడ్డి అభినందనీయులని వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. రామ కృష్ణారెడ్డి తన భార్య, బావ జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం వేసవికాలంలో నెల రోజులుపాటు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు ఈ క్రమంలో బుధ వారం మజ్జిగ కేంద్రాన్ని వైఎస్ మనోహర్ రెడ్డి, పురపాలక చైర్మన్ వల్లభ వరప్ర సాద్ ప్రారంభించారు. మజ్జిగ చలివేంద్రాన్ని 2021 నుంచి ప్రతి ఏడాది నిర్వహిస్తున్నారు.

## కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలి

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం సీనియర్ నాయకులు రాధాకృష్ణ కోరారు. స్థానిక కడప రోడ్డు కాంప్లెక్స్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంతోపాటు కూటమి ప్రభుత్వం కార్మికుల పట్ల నిర్లక్ష్యధోరణి ప్రదర్శిస్తోందన్నారు. ఆరేళ్లుగా కార్మికులకు అందాల్సిన 12 రకాల సంక్షేమ పథకాలు ఇవ్వడం లేదన్నారు. ఈనెల 11న కమలాపురంలోని కార్మికశాఖ కార్యాలయం ఎదుట సంక్షేమ పథకాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాదేండ్ల, ఆళ్లగడ్డ సురేష్, రవి, చిరంజీవి, శ్రీనివాసులు, బాబు, సాదక్, రామాంజనేయులు, శివ, సుభాన్ బాషా, ఆంజనేయులు, బాబు పాల్గొన్నారు.



## దయనీయ స్థితిలో టమోటా రైతులు

### కిలో రూ.మూడు.. రైతుకు భరోసా ఏదీ..?

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

ఆరుగాలం కష్టించే రైతులకు ఎప్పుడు లాభం వస్తుందో.. ఎప్పుడు నష్టం వస్తుందో తెలియని పరిస్థితి. సాలు మీద సాలు దున్ని సచ్చు నేలను కూడా పండించగల సామర్థ్యం ఉన్న రైతన్నకు కష్టాలు ఏదో రూపంలో వెంటాడుతూనే ఉంటాయి. ఇందుకు టమోటా ఉదాహరణగా చెప్పవచ్చు. నిన్నగాక మొన్న కాసులు కురిపించిన టమోటా ధరలు నేడు అమాంతం పడిపోయాయి. టమోటాలు కొనుగోలు చేసే వారేలేరు. ప్రస్తుతం మార్కెట్లో 20కిలోలు రూ.100కు క్రయవిక్రయాలు సాగుతున్నాయి. ఇటీవల టమోటా ధరలు బాక్సు రూ.400 పలికింది. రెండు నెలల వ్యవధిలోనే టమోటా ధరలు పతనం కావడంతో రైతు పరిస్థితి దయనీయంగా మారింది. మళ్లీ టమోటా గిట్టుబాటు ధరకాని పక్షంలో వాటిని మూగజీవాలకు ఆహారంగా అప్పగించే పరిస్థితి తప్పదు. ధరలు పతనం కావడం రైతుకు దిక్కు తెలియని పరిస్థితి ఏర్పడింది. తోటలో పండించిన పంటను అలాగే వదిలేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు స్పందించి తమను ఆదుకోవాలని టమోటా రైతులు కోరుతున్నారు.

## నిరుపేదకు తోపుడు బండి వితరణ

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు( పుట్టపర్తి సర్కిల్)**

ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై, ఆర్థికస్తోమత బాగాలేక ఇబ్బంది పడుతున్న ఎర్రగుంట్లకు చెందిన భాస్కర్ అనే వ్యక్తికి ప్రొద్దుటూరు పట్టణ పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన కొడతాల సునీల్ కుమార్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.14,000 విలువ చేసే తోపుడు బండిని బుధవారం వితరణ చేశారు. వికసిత ఫౌండేషన్ కార్యాలయంలో సునీల్ కుమార్‌రెడ్డి తల్లి పద్మజ భాస్కర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శూలం లక్ష్మీదేవి మాట్లాడుతూ భాస్కర్ కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, సహృదయంతో తోపుడు బండిని అందించిన సునీల్ కుమార్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శూలం శేఖర్, శూలం శివప్రసాద్, సుబ్బయ్య, ధనుంజయ పాల్గొన్నారు.




తోపుడు బండిని అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

# క్రైం కార్నర్

## ప్రమాదవశాత్తూ రైలు కింద పడి వ్యక్తి మృతి

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**



స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో రైలు వెళుతున్న క్రమంలో బుధవారం ప్రమాదవశాత్తూ దాని కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు ఆకుపచ్చని లుంగీ, తెల్లగళ్ల షర్టు ధరించి ఉన్నాడు. దాదాపు 50 నుంచి 55 సంవత్సరాల వయసు ఉంటుంది. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బైక్ అదుపుతప్పి బోల్తా : ముగురికి గాయాలు

### - ఒకరి పరిస్థితి విషయం

**ప్రజాశక్తి -లింగాల**

మండల పరిధిలోని వెలిదండ్ల గ్రామ పరిసరాల్లో బుధవారం ప్రమాదవశాత్తూ ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ముగ్గురు యువకులు గాయపడ్డారు. లింగాలకు చెందిన వెంకటనాథ్, చరణ్, రవి ద్విచక్రవాహనంలో విహారయాత్రకు కోసం పార్నపల్లె పెంచికల బసిరెడ్డి జలాశయం వద్దకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వెలిదండ్ల తూర్పు ఆంజనేయస్వామి ఆలయం సమీపం వద్ద అదుపుతప్పి బోల్తా పడ్డారు. వెంకనాథ్, చరణ్ ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రవి గాయపడ్డాడు. వారిని స్థానికులు ప్రత్యేక వాహనంలో చికిత్స నిమిత్తం పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకటనాథ్ పరిస్థితి తీవ్రంగా ఉండడంతో పులివెందుల పట్టణంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# చేపల కోసం చెరువు నీరు వంకపాలు

### నీరు వృథాగా పోతున్నా పట్టని అధికారులు.. నీటి ఎద్దడి తలెత్తుతుందని ప్రజల్లో ఆందోళన



నిండుకుండలా ఉన్న రామసుబ్బమ్మ చెరువు



వృథాగా కాలువలో వెళుతున్న నీరు

**ప్రజాశక్తి - చాపాడు**

వేసవిలో భూగర్భ జలాలు ఇంకి పోకుండా చెరువులకు, వంకలకు అధికారులు నీటిని నింపుతుంటారు. కానీ చాపాడు మండల పరిధిలో అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. పల్లవోలు గ్రామ సమీపంలో ఉన్న రామసుబ్బమ్మ చెరువులో ప్రస్తుతం నీరు నిండు కుండలా ఉంది. ఇది మంచి విషయమైనప్పటికీ చేపలు పట్టే కొంత మందికి నీరు నిల్వ ఉండడం మింగుడు పడడంలేదు. దీంతో చెరువు కింద ప్రస్తుతం వ్యవసాయానికి నీటి అవసరం లేకపో యినా అనధికారికంగా నీటిని వదిలేస్తున్నారు. చెరువులోని చేపలు మాత్రం ఆ నీటితోపాటు కిందికి వెళ్లకుండా కంచెకు ఉపయోగించే జాలర్‌ను ఏర్పాటు చేశారు. మూడు రోజులుగా చెరువులోని నీరు వృథాగా పోతున్నట్లు గ్రామస్తులు పలువురు వాపో తున్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చెరువులో నీరు ఉంటే ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు పేర్కొం టున్నారు. చెరువులో నీరు ఉంటే బోరుబావులలో నీరు సమృద్ధిగా ఉంటుందని వారు పేర్కొం టున్నారు. ప్రస్తుతం నీరు వృథాగా పోతే రాబోయే రెండు నెలలు తాగు నీటికి చాలా ఇబ్బందులు ఏర్పడతాయని ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. పశువులకు తాగునీటి అవసరాల కోసం కూడా ఈ నీరు ఉపయో గపడుతుందని పేర్కొం టున్నారు. నీరు వృథాగా పోతే పశువులు, ప్రజలకు చాలా ఇబ్బందులు పడుతారని అంటున్నారు. సంబంధిత చిన్న నీటి పారుదల శాఖ అధికారులు, స్థానిక పంచాయతీ అధి కారులు విషయం తెలిసినప్పటికీ తమకు ఏ మాత్రం సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువు నీరు వృథాగా కిందకు పోకుండా చర్యలు చేపట్టాలని, షట్టర్ ద్వారా నీటిని ఎవరూ కిందకు వదలకుండా రక్షణగా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.



చేపల కోసం షట్టర్ వద్ద ఏర్పాటు చేసిన జాలర్

# క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

### నిఘా నుంచి తప్పించుకోలేరు.. 23 మంది అరెస్టు, భారీ నగదు, 23 సెల్‌ఫోన్లు స్వాధీనం : డిఎస్‌పి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

ఎస్‌పి ఆదేశాల మేరకు పట్టణంలో క్రికెట్ బెట్టింగ్ అరికట్టేందుకు గట్టి నిఘా ఏర్పాటు చేశామని, ఈ క్రమంలో ఈనెల 8న అందిన సమాచారం మేరకు ప్రొద్దుటూర్ వన్ టౌన్ సిఐ, ఎస్ఐ, సిబ్బంది రామేశ్వరం నీళ్ల ట్యాంక్‌ల వద్ద క్రికెట్ బెట్టింగ్ నిర్వహించి, లావాదేవీలు నిర్వహిస్తున్న 18 మందిని ఆరెస్టు చేశామని డిఎస్‌పి భావన తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2 లక్షల 5వేలు నగదు, 18 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పుత్తా గిరీష్ అను వ్యక్తి గతంలో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహించి నష్టపోయి ఉండగా, అతని గురించి తెలుసుకొన్న బిజీబుల్ 247.కామ్ అను వెబ్‌సైట్ వారు అతనిని సంప్రదించి బెట్టింగ్ నిర్వహించమని కోరగా, అతను సదరు వెబ్‌సైట్ ద్వారా కమీషన్ పొందుతూ తనకు తెలిసిన వారి ద్వారా క్రికెట్ బెట్టింగ్ ఆడే వారిని అందులో చేర్పిస్తున్నారని, వారి ద్వారా మరికొంతమందిని బెట్టింగ్ సభ్యులుగా చేర్చి, ఒక వ్యవస్థీకృతంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడన్నారు. నిఘాలో సదరు వ్యక్తిని గుర్తించి అతనిని, అనుచరులైన మరో 40 మందిని గుర్తించామన్నారు. బుధవారం గిరీష్‌తో కలిపి మొత్తం 18 మంది అరెస్టు కాగా, మిగిలిన వారిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. ప్రొద్దుటూర్ టౌన్ కోనేటి కాల్వ వీధికి చెందిన షేక్ మాబుషరీఫ్ అలియాస్ చుంచు, పిండాల జనార్దన్‌రెడ్డి, భూమిరెడ్డి, నాగార్జునరెడ్డి, వేంపల్లి సుదర్శన్‌రెడ్డి, శ్రీరామ్ సుబ్బరాయుడు, ప్రొద్దుటూర్ టౌన్ ఇస్లాంపురం దర్గా వద్ద ప్రస్తుత ఐపిఎల్ సీజన్‌లో వారు బెట్టింగ్ నిర్వహించి, అందుకు సంబంధించి ఇంతవరకు తమ మధ్య వున్న డబ్బు లావాదేవీలు, పంపకాలు చేసుకొనుచుండగా, రాబడిన కచ్చితమైన సమాచారం మేరకు ప్రొద్దుటూర్ 1 టౌన్ సిఐ రామకృష్ణా రెడ్డి, సిబ్బంది సదరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 5 సెల్ ఫోన్ రూ.లక్ష 5వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రొద్దుటూరు ప్రాంతానికి చెందిన ఏలే నరసింహ, అరవ మునివర, షేక్ ఫారూక్, షేక్ గౌస్‌బాషా అలియాస్ బెంగుళూరు బాషా, షేక్ ఖాదర్‌బాషా అను బెట్టింగ్ నిర్వాహకుల కనుసన్నలలో పై వ్యక్తులు ప్రొద్దుటూరు ప్రాంతంలో ప్రస్తుత ఐపిఎల్ సీజన్ లో బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు గుర్తించి అందరిపైనా కేసులు నమోదు చేశామన్నారు. అరెస్టు కాబడిన మొత్తం 23 మందిని బుధవారం కోర్టు ముందు హాజరు పరిచామని డిఎస్పీ భావన తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచన ప్రొద్దుటూర్ వన్‌టౌన్ సిఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ సంజీవరెడ్డి, ఎస్ఐ ఎస్.శ్రీనివాసులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించి, వారికి తగు రివార్డుల నిమిత్తం సిఫార్సు చేయనున్నట్లు డిఎస్‌పి భావన వివరించారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి భావన

# రసాభాసగా సాగిన కౌన్సిల్ సమావేశం




సమావేశంలో ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం రసాభాసగా కొనసాగింది. మున్సిపల్ వైస్ చైర్మన్ కాజా మొహిద్దిన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభమైన వెంటనే కౌన్సిల్‌తో సంబంధంలేని కొత్త వ్యక్తులు సమావేశ మందిరంలోకి రావడంతో రచ్చ చోటు చేసు కుంది. 20 నిమిషాల సేపు సమావేశాన్ని వాయి దా వేసి తిరిగి కొనసాగించారు. 24వ వార్డు మాజీ కౌన్సిలర్ జమాలుద్దీన్ మృతికి సంతాపం తెలిపారు. అనంతరం కౌన్సిలర్ పిట్ట బాలాజీ సోలార్ విద్యుత్ నిర్వహణపై మాట్లా డుతూ కొన్ని మార్పులు చేర్పులతో నిర్వహిం చాలన్నారు. టాటా లాంటి పెద్ద సంస్థ కిలో వాట్‌కు రూ.50లకు ఇస్తుంటే మనం రూ.67కు ఇవ్వడంపై పునరాలోచించాలన్నారు. రెండవ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి మాట్లా డుతూ పట్టణ పరిధిలోని మైదాన ప్రాంతాన్ని గుర్తించి సోలార్ సిస్టంను ఏర్పాటు చేయా లన్నారు. అనంతరం కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ సోలార్ సిస్టం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ సభ్యుల సూచనలను కూడా పరిగణలోకి తీసుకుం టామన్నారు. కౌన్సిలర్లు గాజుల శివజ్యోతి, కమల్ బాషా మాట్లాడుతూ అజెం డాలోని ఎనిమిదవ అంశాన్ని రద్దు చేయాలని కోరారు. దీనిపై ప్రతిపక్షానికి చెందిన కొంత మంది కౌన్సిలర్లు ఓటింగ్‌కు పట్టుబడగా కౌన్సిలర్ ఇర్ఫాన్ మాట్లాడుతూ గతంలో కొన్ని అంశాలపై రద్దును ప్రతిపా దించామని అప్పుడులేని ఓటింగ్ పద్ధతి ఇప్పుడెం దుకని ప్రశ్నించారు. కౌన్సిలర్ వంశీ మాట్లాడుతూ టెండర్ విధానంపై సభ్యులకు శిక్షణ ఇవ్వాలని కోరారు. రోడ్ల విస్తరణ అంశంపై వైస్ చైర్మన్ కాజా మొహిద్దిన్ మాట్లాడుతూ రోడ్లు నాగరి కతకు చిహ్నాలని రోడ్ల విస్తరణ కచ్చితంగా చేయి స్తామన్నారు. ఇర్ఫాన్ బాషా మాట్లాడుతూ తన వార్డులో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణా లపై మూడేళ్లుగా పోరాటం చేస్తున్న ప్పటికీ అధికారుల అలసత్వం వల్ల ఫలితం లేదన్నారు. ముఖ్యంగా ఇందులో పట్టణ ప్రణాళిక విభాగం వైఫల్యాన్ని ప్రస్తావించారు. ఇందుకు కమిషనర్ అభ్యంతరం వ్యక్తం చేయగా కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. రెండవ వైస్ చైర్మన్ బంగారు రెడ్డి డివియేషన్ అంశంపై మాట్లా డుతూ పట్టణంలోని ఎస్ఎస్ మాల్ డీవీయేషన్‌పై రూ.5కోట్ల 20లక్షలు అపరాధ రుసుం చెల్లిం చాల్సి ఉన్న చెల్లించలేదని పట్టణం లోని డీవీ యేషన్ అన్నిటిపై సమగ్ర విచారణ చేపట్టాల న్నారు. వైస్ చైర్మన్ కాజా మొహిద్దీన్ మాట్లాడుతూ జిల్లా సర్వేయర్లతో సమగ్ర సర్వే చేయించాలన్నారు. కౌన్సిలర్ వరుకుటి ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఇందుకు ఏకకాలంలో పట్టణమంతా దోమల నివారణ చర్యలు నిర్వహించాలన్నారు. ఎక్స్ అఫీషియో సభ్యుడి హోదాలో ఎమ్మెల్యే వరదరాజు రెడ్డి కొన్ని అంశాలను డీసెంట్ కోరగా వాటిపి ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు మధ్య సమావేశం నిర్వహించారు.

# సమావేశం దృష్టికి పలు సమస్యలు



మాట్లాడుతున్న సిడిపిఒ అరుణకుమారి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

మండలంలోని గోపవరం గ్రామపంచాయతీ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో బుధవారం ఎంపిపి సాన బోయిన శేఖర్ యాదవ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం సాదాసీదాగా సాగింది. కొంతమంది ప్రజా ప్రతినిధులు ఆయా ప్రాంతాల్లోని పలు సమస్యలను విన్నవించారు. పెద్దశెట్టిపల్లి గ్రామపంచాయతీ నరసింహపురం గ్రామంలో తాగునీటి బోరు సమస్య ఉందని, దాన్ని పరిష్కరించాలని సర్పంచు మధుసూదన్ కోరారు. మండలంలోని ఏడు అప్పర్ ప్రైమరీ స్కూళ్లను హైస్కూల్‌గా మార్చేందుకు జిల్లా ఉన్నతాధికారులకు నివేదికల పంపించామని ఎంఇఒ సావిత్రమ్మ పేర్కొన్నారు. కల్లూరు గ్రామంలో తాగునీటి పైప్‌లైన్ పూర్తిగా దెబ్బతిందని సర్పంచ్ వల్లూరు శివలక్ష్మి అధికారుల దృష్టికి తెచ్చారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని పైప్‌లైన్ రూట్ మార్చి కొత్తది వేసేందుకు గ్రామపంచాయతీ తీర్మానం అయిందన్నారు. మంజూరు, అగ్రిమెంట్ అయిపోయిందన్నారు. అయితే అధికారులు మాత్రం పనులు చేయకుండా నిలిపేయాలని చెప్పడంలో అంతర్యమేమిటిని ఆమె ప్రశ్నించారు. తాగునీటి సమస్యను రాజకీయం చేయొద్దన్నారు. బుడ్డాయిపల్లె పశువైద్యాధికారి డాక్టర్ ఫణీంద్రారెడ్డి మాట్లాడుతూ పాడి రైతులు పశు బీమా, మండలానికి మంజూరైన 30 మినీ గోకులాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా సొంత భూమి ఉన్న రైతులు మేలురకం జాతి గడ్డిని కూడా పెంచుకోవచ్చన్నారు. ట్రాన్స్‌కో అధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం ద్వారా సబ్సిడీతో ప్యానల్‌ను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. విద్యుత్ వినియోగదారులు వర్షాలు కిలోవాట్స్ పెంచుకునేందుకు 50 శాతం రాయితీ కల్పించామన్నారు. మండలంలోని గ్రామపంచాయతీలు సుమారు రూ.10 కోట్లు విద్యుత్ బకాయి ఉందని, త్వరగా చెల్లించాలని ఆయన కోరారు. సమావేశంలో ఎంపిడిఒ కార్యాలయ సూపరింటెండెంట్ బాలన్న, హౌసింగ్ డిఇ గురుప్రసాద్, కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రీనివాసులు, వెలుగు ఎపిఎం వెంకటసుబ్బమ్మ, కెసి కెనాల్ ఎఇ గురుమోహన్‌రెడ్డి, ఐసిడిఎస్ రూరల్ సిడిపిఒ అరుణకుమారి, ఉపాధి హామీ పథకం ఎపిఒ మహేశ్వర్ రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.





చీనీ తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

## పొలుసు పురుగు, వేరు కుళ్లు నివారిస్తే లాభసాటి

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

చీనీ తోటల్లో పోలుసు పురుగు, వేరు కుళ్లు తెగులు నివారిస్తే రైతులకు లాభసాటిగా ఉంటుందని పులివెందుల అరటి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు కె.అరుణోదయం, శివరామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని బలపనూరు, అనకాలమ్మ గూడూరు, హిమకుంట్ల, సుంకేసుల, అహోబిలం గ్రామాల్లో బుధవారం శాస్త్రవేతలు చీనీ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చీనీ తోటల్లో కొన్ని ప్రాంతాల్లో నీరు అధికంగా ఉండడం, తేమ ఆరకపోవటంతో చెట్టు వేర్లు త్వరగా కుళ్లి క్షీణిస్తున్నాయని తెలిపారు. చీనీ చెట్లు దెబ్బ తినకుండా ఉండాలంటే రోజుకు 60 లీటర్ల మించి నీరు పెట్టకూడదన్నారు. పొలుసు పురుగు, బంక తెగులు ఎక్కువగా ఉండడం వల్ల చెట్లు త్వరగా చనిపోతున్నాయన్నారు. ట్రికోడర్మా, సూడోమోనస్ ద్రావణాన్ని ఏడాదికి రెండు సార్లు భూమిలో వేసుకున్నట్లయితే వేరు కుళ్లు రోగాన్ని శాశ్వతంగా నివారించుకోవచ్చని శాస్త్రవేతలు సూచించారు. కార్యక్రమంలో ముద్దనూరు ఉద్యానవన శాఖ అధికారి మల్లేశ్వరరెడ్డి, ఆయా గ్రామాల రైతుసేవా కేంద్ర సిబ్బంది ఉష, శ్రీలేఖ, దీపిక, రైతులు పాల్గొన్నారు.

## ప్రగతిపై రెండో దశ సమీక్ష షురూ

**ప్రజాశక్తి-కడప అర్బన్**

యోగి వేమన విశ్వవిద్యాలయం నూతన విసి ఆచార్య అల్లం శ్రీనివాసరావు శాఖల వారీగా సమీక్షను బుధవారం ప్రారంభించారు. జాతీయ విద్యా విధానం-2020ని ప్రకారం విద్యార్థుల సంపూర్ణ ప్రగతికి విశ్వవిద్యా లయంలోని శాఖల ఆలోచనలు, భవిష్యత్తు ప్రణాళికలు స్టడీ చేసేందుకు ఆయన పలు విభాగాల ను సందర్శించారు. ఎంబిఎ విభాగాధిపతి డాక్టర్ పి.సరిత, కామర్స్ సహ ఆచార్యులు డాక్టర్ విజయభారతి, ఎంసీఏ శాఖ సహ ఆచార్యులు డాక్టర్ రెడ్డయ్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారి వారి విభాగాల అభివృద్ధి గురించి విసి ముందు వివరించారు. శాఖల భవిష్యత్తు కార్యచరణ ప్రణాళిక, లక్ష్యాలను, విజన్ డాక్యుమెంట్ రూపొందించడం గురించి వివరించారు. విసి ఆచార్య శ్రీనివాసరావు సూచనచేస్తూ విద్యార్థుల భవిష్యత్తు మన ప్రధాన లక్ష్యమన్నారు. నైపుణ్య కేంద్రాలు,విద్యా ప్రయోగశాలలు, పరిశోధన ల్యాబ్‌ల కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను సృష్టించేందుకు పరిశ్రమలు సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి ఉన్నారు.

## ఉల్లి పరిశోధన కేంద్రానికి స్థలం కేటాయించాలి

**ప్రజాశక్తి - చాపాడు**

జలవనరుల శాఖ భూమిని ఉల్లి పరిశోధన కేంద్రం ఏర్పాటు నిమిత్తం కేటాయించాలని రైతు సంఘం నాయకులు బిపి ప్రతాప్‌రెడ్డి లోకాయుక్తకు విన్నవించారు. భూమి కేటాయించకుండా వివక్షత చూపుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎలాంటి అనుమతులు లేకుండా ప్రయివేట్ గుత్తేదారుకు డబ్బులు కట్టిన వెంటనే మట్టి కోసం అనుమతులు జారీ చేశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన జాతీయ ఉద్యానవన పరిశోధన అభివృద్ధి సంస్థ భూమి కేటాయింపునకు రెవెన్యూ శాఖ, ఆర్థికశాఖ, కలెక్టరు, శాసనసభ్యుడి ఉత్తరం, జలవనరుల శాఖ మంత్రి అనుమతి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనుమతి తప్పనిసరిగా కావాలని 2021 సంవత్సరం నుంచి జలవనరుల శాఖ వద్దనే ఫైల్‌ను నిలబెట్టుకున్నారన్నారు. ప్రయివేట్ గుత్తేదారుకు మాత్రం చదరపు మీటరు రూ.140చొప్పున మట్టి తవ్వుకుని పోయేలా అనుమతి లేకుండానే కట్టబెట్టారన్నారు. ఒక చదరపు మీటరు మట్టి తవ్వి తీసుకుపోవాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా 20అడుగుల నుంచి 30అడుగుల లోతు వరకు మట్టి తీసి తరలిస్తున్నారన్నారు. ఉల్లి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు వెంటనే స్థలాన్ని కేటాయించాలని ఆయన కోరారు.




డ్రస్ట్‌బిన్‌లనుఅందజేస్తున్న ప్రిన్సిపల్ యోగాంజనేయులు

## వ్యర్థాలు పర్యావరణానికి ముప్పు

**ప్రజాశక్తి - వేంపల్లె**

అనర్థదాయక వ్యర్థాలు వలన పర్యావరణానికి ముప్పు అని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వస్తువులను మళ్లీ ఉపయోగించకుండా పారవేసినప్పుడు వాటిని ఎలక్ట్రానిక్ వ్యర్థాలు అంటారాని తెలిపారు. వీటి ద్వారా భూమి, నీరు, వాతావరణం కలుషితం అవుతుందని వివరించారు. పర్యావరణానికి పెను ముప్పుగా మారి వాతావరణంలో అసమతుల్యత ఏర్పడుతుందని చెప్పారు. ఈ వ్యర్థాల వల్ల నష్టాలు, ఆరోగ్య సమస్యలను నివారించేందుకు మూడు ముఖ్యమైన పద్ధతులను అవలభించాలని సూచించారు. కాలుష్య నివారణకు దోహద పడాలని కోరారు. అనంతరం ప్రతి తరగతి గదికి డ్రస్ట్‌బిన్‌లను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్ రెడ్డి, డాక్టర్ మల్లేశ్వరమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

**ప్రజాశక్తి - ముద్దనూరు**

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని పిహెచ్‌సి వైద్యాధికారులు శ్రీకాంత్, నాగార్జున సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్యులు శ్రీకాంత్, నాగార్జున ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు సురక్షితమన్నారు. అనంతరం గర్భిణులకు పలు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ప్రసాద్ యాదవ్, విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, పర్యవేక్షకులు శోభా కుమారి, రామారావు, ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, ఫార్మసిస్ట్ జగదీష్, పాల్గొన్నారు.